హైదరాబాద్ వార్త

ట్రాఫిక్ సెన్స్... జీరో టాలెరెన్స్!

- రెండు నెలల్లో దాదాపు 2వేలకుపైగా కేసులు నమోదు
- తనిఖీలు, అవగాహనతో ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- సామాజిక శిక్షతో మార్పుకు యత్నం

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న యమధర్మరాజు వేషధారి

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్తః మద్యం సేవించి వాహనాలపై తిరిగేవారు రోడ్ టెర్రరిస్టులతో సమానం.. ఇది సాక్షాత్తు నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ చెప్పిన మాట. మద్యం సేవించి వాహనం నడిపే వారు మత్తులో ప్రమాదానికి కారకులవ్వడమే కాకుండా అ భంశుభం తెలియని ఎదుటి ప్రయాణికుల ప్రాణాలను తీస్తారని అంటారు.. అందుకే.. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అయిదు నెలల్లో ఆయన నగర శాంతిభద్రతలతో పాటు ట్రాఫిక్ వ్యవస్థపైన అంతేదృష్టి పెట్టారు.. అందుకే ఈ అయిదు నెలల కాలంలో మద్యం సేవించి దాదాపు 1500ల మందికిపైగా పట్టుబడ్డారు.. వివిధ రకాల అవగాహన కార్యక్రమాలతో వాహనదారుల్లో అవగాహన కల్పిస్తున్నారు. నగరంలో ప్రమాదాలను, రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్యను తగ్గించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు. ప్రధానంగా ప్రమాదానికి కారణమవుతున్న ఏడు అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. అందులో భాగంగా అధిక వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, రెడ్ లైట్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సీటు బెల్టు ధరించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం ఉన్నాయి. ఈ అంశాలపైనే నగర పోలీసు కమిషనర్‌తోపాటు ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్ ప్రత్యేకంగా దృష్టి సారించారు.

తప్పతాగి రోడ్లు ఎక్కుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు తనిఖీలు కొనసాగిస్తున్నప్పటికి కొందరు మద్యం సేవించి రోడ్డుపైకి వాహనాలతో వస్తున్నారు. ఇలా వస్తున్న వారిలో పూటుగా సేవించి రోడ్డుపైకి వస్తున్నవారు ఉన్నారు. గత రెండు నెలల కాలంలో పరిశీలిస్తే దాదాపు రెండు వేలకుపైగా మద్యం సేవించి వాహనాలు నడిపే కేసులు నమోదయ్యాయి. ఇందులో 30 నుంచి 100 ఎంజీ మద్యం సేవించిన వారి సంఖ్య 1400ల మందికిపైగా ఉండగా 100 నుంచి 200ల ఎంజీ మద్యం సేవించి పట్టుబడ్డ వారి సంఖ్య దాదాపు 650 వరకు ఉంది. ఇక 200ల నుంచి 300లకుపైగా మద్యం సేవించి పట్టుబడిన వారి సంఖ్య దాదాపు 170 మంది ఉన్నారు. వీరంతా నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు. ఇక నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 24 నుంచి జనవరి 1 వరకు నిర్వహించిన తనిఖీల్లోనూ మద్యం సేవించి పట్టుబడిన వారిలో దాదాపు 270 మందికి కోర్టు శిక్ష సైతం విధించింది.

అవగాహన కల్పిస్తున్నారు..

ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్‌తోపాటు రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దాదాపు 2వేలకుపైగా వాహనదారులు మద్యం సేవించి పట్టుబడగా రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులపై ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో దాదాపు 21,713 కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఠాణాల వారీగా, టిటిఐ ట్రాఫిక్ పోలీసులు సంస్థల వారీగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా పాఠశాలలు, కళాశాలలు, సంస్థలు, సంఘాలు అన్నింటికి వెళ్లి అక్కడున్న వారికి ప్రాధాన్యత అంశాలను వివరిస్తున్నాం. ముమ్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడుతాం. ప్రమాదాలను తగ్గించి, ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

పట్టుబడుతున్న వారిలో..

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడుతున్న వారిలో అత్యధికంగా బైకు నడుపుతున్న వారే ఉంటున్నారు. గత రెండు నెలల కాలంలో పరిశీలిస్తే మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డ వారి సంఖ్య 2058, త్రీ వీలర్లు(ఆటోలు) 171 ఉండగా మద్యం సేవించి కార్లు నడుపుతూ పట్టుబడ్డ వారి సంఖ్య 285గా ఉంది. దీనికితోడు పూటుగా మద్యం సేవించి 300ల ఎంజీగాపైగా రక్తంలో మద్యం మోతాదు శాతం ఉన్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ఇందులో పట్టుబడిన వారిలో అయిదు నుంచి పది శాతం మంది 300ల ఎంజీగా పైగా మద్యం సేవించి పట్టుబడుతున్నారు.

ప్రమాదాలు నివారించే ప్రయత్నం చేస్తున్నాం

కట్టా హరిప్రసాద్, ట్రాఫిక్ ఎసిపి, జూబ్లీహిల్స్ జోన్.

ప్రమాదాలను నివారించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. నగర పోలీసు కమిషనర్ సజ్జనార్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్ సూచనల మేరకు ఎప్పటికప్పుడు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. నిబంధనలు పాటించే వారికి గులాబీలు ఇస్తు న్నాం. యమధర్మరాజు వేషధారితో వాహనదారులకు అవగాహన పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నాం. ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా పాఠశాలలు, కళాశాలలు, సంస్థలు, సంఘాలు అన్నింటికి వెళ్లి అక్కడున్న వారికి ప్రాధాన్యత అంశాలను వివరిస్తున్నాం. ముమ్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడుతాం. ప్రమాదాలను తగ్గించి, ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

దోమలు వదిలేసి..డీజిల్ మింగేసి..

-యాంటమాలజీలో ఆగని అవినీతి
-ఫాగింగ్ చేయకుండానే డీజిల్ మాయం
-పెట్రోల్‌బంకులతో కుమ్మక్కు..
-ఇంధనానికి బదులు నగదు వసూలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: నగరంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. దోమల సంఖ్య విపరీతంగా పెరిగింది. సాయంత్రం అయితే చాలు బయట తిరిగే పరిస్థితి లేదు.. కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు అన్న తేడా లేకుండా దోమల దాడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దోమల అటాక్ తో డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయి. అయితే ఈ దోమలను నియంత్రించే అధికారులు, సిబ్బంది మాత్రం అవినీతి అక్రమాలతో బిజీగా ఉన్నారు. ఎంటమాలజీ విభాగంలో రోజుకో స్కామ్ బయటకొస్తుంది. కాలనీలు, బస్తీల్లో దోమల బెడద తగ్గించడానికి ఫాగింగ్ చేయడానికి ఉపయోగించే డీజిల్ ను పక్కదారి పట్టిస్తున్నారు. ఒక్కో సర్కిల్ లో ఫాగింగ్ కోసం ప్రతీరోజు 84 లీటర్ల డీజిల్ ఇస్తారు. అయితే ఈ డీజిల్ లో మెలాథిన్ అనే కెమికల్ కలిపి ఫాగింగ్ చేయాలి.. కానీ ఆయా సర్కిళ్ల సూపర్ వైజర్లు అందులో కేవలం 20 నుంచి 24 లీటర్ల డీజిల్ మాత్రమే ఫాగింగ్ చేసి మిగతా డీజిల్ అమ్ముకుంటున్నారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులకు లీటర్ డీజిల్ కు పది రూపాయల కమీషన్ ఇచ్చి మిగతా డబ్బులు తీసుకుని వర్కర్లు, సూపర్ వైజర్, ఏఈ, ఎస్ఈ లు పంచుకుంటున్నారు. మల్కాజిగిరి సర్కిల్ లో సిబ్బంది మధ్య పంపకాల్లో తేడా రావడంతో డీజిల్ పక్కదారి పట్టించే స్కామ్ బయటపడింది. ఎంటమాలజీ సూపర్ వైజర్ సిబ్బందికి ప్రతీ నెలా ఐదు వేలు వేసి మిగతా డబ్బులన్నీ ఏఈ, ఎస్ఈ కు పంచుతున్నట్లు బయటపెట్టారు. సిబ్బందికి ఫోన్ పే ద్వారా వేసిన డబ్బుల స్క్రీన్ షాట్స్ బయటపెట్టారు. దీంతో ఉన్నతాధికారులు సూపర్ వైజర్ తో పాటు స్కామ్ బయటపెట్టిన వర్కర్ ను సస్పెండ్ చేశారు. అలాగే డీజిల్ స్కాం బయటపడటంతో అధికారులు డీజిల్‌లో మెలాథిన్ కెమికల్ కలిపి ఇవ్వడం ప్రారంభించారు. దీంతో డీజిల్‌ను అమ్ముకునే అవకాశం లేకపోవడంతో కొందరు సిబ్బంది ఫాగింగ్ చేయకుండా డీజిల్‌ను బయట పారబోస్తున్నారు.. బైక్ పై తిరుగుతూ ఫాగింగ్ చేయాలంటే బైక్ పెట్రోల్ ఖర్చు అవుతుందని భావించి ఎలాంటి ఫాగింగ్ చేయకుండానే డ్రైనేజీ, ఓపెన్ ప్లేసుల్లో పారబోస్తున్నారు.. దీంతో కాలనీల్లో ఫాగింగ్ చేయకపోవడంతో దోమల సమస్య మాత్రం తగ్గడం లేదు. మెలాథిన్ కలిపిన డీజిల్‌ను అమ్మడానికి వీలు లేకపోవడంతో డైరెక్ట్ గా మెలాథిన్ కెమికల్ ను అమ్ముతూ పట్టుబడ్డారు ఎంటమాలజీ సిబ్బంది. నాంపల్లిలో ఎవరైతే మెలాథిన్ ను సప్లై చేస్తున్నారో అదే వ్యక్తికి డ్రమ్ముల కొద్దీ మెలాథిన్ అమ్ముతుండగా టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. నరేష్ అనే ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీ ను అరెస్ట్ చేయగా మెలాథిన్ అక్రమ అమ్మకాల చిట్టా బయటపడింది. కేవలం నాంపల్లిలో కాకుండా దోమలగూడ, అత్తాపూర్, ముషీరాబాద్, హయత్ నగర్, గోల్కొండ సర్కిళ్లలో కూడా ఇలాగే మెలాథిన్ పక్కదారి పట్టించినట్లు తెలిసింది.. ఇందులో అధికారుల పాత్ర ఉందని తేలింది.. ఈ కేసులో 12 మందిపై ఎఫ్ఐఆర్ అవ్వగా వారందరూ ఇంకా వారంతా విధుల్లోనే ఉన్నారు. దోమలగూడ సర్కిల్లో ఇంతియాజ్ అనే వ్యక్తి గతంలో డీజిల్ అమ్ముతుండగా పట్టుబడగా.. ఇప్పుడు మెలాథిన్ స్కామ్ లో అతని పేరు బయటపడింది. అయినా అధికారులు అతడిని విధుల్లోనే కొనసాగించడం గమనార్హం.

చర్యలు శూన్యం..

దోమల ఫాగింగ్ లో ఇన్ని స్కామ్‌లు బయటపడ్డా ఇప్పటివరకు ఏ అధికారి పైనా చర్యలు మాత్రం తీసుకోలేదు ఉన్నతాధికారులు.. కింది స్థాయి సిబ్బంది కన్నా అసిస్టెంట్ ఇంజనీర్లు, సీనియర్ ఎంటమాలజిస్టులు భారీగా వెనకేసుకున్నారని బయటపడ్డా వారిపై ఎలాంటి చర్యలు లేకపోగా వేరే స్థానానికి బదిలీ కూడా చేయట్లేదనే విమర్శలు వస్తున్నారు. అధికారుల అవినీతి, సిబ్బంది నిరక్ష్యం, పర్యవేక్షణ లోపం, ఇవన్నీ కలిసి నగర వాసులకు దోమల బెడదను పెంచుతున్నాయి. పెరుగుతున్న డెంగ్యూ కేసులు పెరుగుతుండటంతో సంబంధిత ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోసం కిషన్ రెడ్డి బస్తీబాట

-పేదల సంక్షేమం, స్థానిక సమస్యలపై దృష్టి -సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: హైదరాబాద్ నగరంలో బస్తీల్లో జనాభా వేగంగా పెరగడంతో పాటు కొత్త కాలనీలు, కొత్త అపార్ట్‌మెంట్లు వెలుస్తున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దీంతో పాటు సమస్యలు కూడా ఎక్కడిక్కడ పెరిగిపోతున్నాయని, వాటిని పరిష్కరించల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, మెట్టుగూడ డివిజన్ లలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బస్తీ వాసులతో కలిసి గల్లీల్లో కలియ తిరిగారు. ఈ సందర్భంగా పేదల సంక్షేమం, స్థానికుల మౌలిక సమస్యలపై దృష్టి సారించి, ప్రజలను స్వయంగా కలుసుకుని సమస్యలు తెలుసుకున్నారు వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు అనంతర...కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఆరు నెలలకోసారి నగర స్వరూపమే మారిపోతోందని తెలిపారు. పెరుగుతున్న సమస్యలకు అనుగుణంగా పరిష్కారాన్ని చేకూర్చాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. 150 డివిజన్లు ఉన్న జీహెచ్ఎంసీని 300 డివిజన్లుగా విభజించి, ఒక్క కార్పొరేషన్‌ను మూడు ముక్కలుగా చేయడం వెనుక భారతీయ జనతా పార్టీని రాజకీయంగా దెబ్బతీయాలనే అక్కసే కారణమని ఆరోపించారు. హైదరాబాద్ కోర్ సిటీని మజ్లిస్ పార్టీకి అప్పగించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోందన్నారు. ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరిస్తూ ప్రజల సమస్యలను పూర్తిగా గాలికొదిలేశాయని విమర్శించారు. హైదరాబాద్‌కు తగినంత నీటిని తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎండాకాలం మొదలవడంతో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండాకాలం మొదలు ముందే హైదరాబాద్‌లో వర్షపు నీటి కాలువల్లో యుద్ధప్రాతిపదికన సిల్ట్ తొలగించాల్సి ఉండగా, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పేపర్ల మీద మాత్రం కాంట్రాక్టర్లు సిల్ట్ తీసినట్లు చూపించి, చెల్లింపులు చేసుకున్నారని ఆరోపించారు. బస్తీల్లో కాలువల్లో పేరుకుపోయిన పూడికను కూడా తొలగించడం లేదని, దీని వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని తెలిపారు. హైదరాబాద్ ప్రజల సమస్యలను పరిష్కరించే పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీదే ఉందని స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై తక్షణమే నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పాలకవర్గం రద్దయిన నేపథ్యంలో, ఇప్పటికైనా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజలను నేరుగా కలుసుకుంటూ, అధికారులతో కలిసి పాదయాత్రలు నిర్వహించి, సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా తాను నిరంతరం కృషి చేస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, బండ కార్తీకరెడ్డి, బండ చంద్రారెడ్డి, కందడి నాగేశ్వర్‌రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి, ప్రభుగుప్త, చందుపట్ల అరవింద్, ప్రియాంక, హరి, పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ట్రాఫిక్ సిగ్నల్స్‌లేని వ్యవస్థను తీర్చిదిద్దుతాం

- కేబీఆర్ చుట్టూ హెచ్ సిటి పనులు ప్రారంభం
- క్షేత్రస్థాయిలో పన్యటించి పరిశీలించిన నగర కమిషనర్ సివి సజ్జనార్

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్తః భవిష్యత్తులో పెరగనున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని నగరంలో చేపట్టిన హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్ ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్ సిటీ) ప్రాజెక్టు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మెఘా సంస్థ(ఎంతఃఐఎల్) ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనులకు బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లో భూమిపూజ చేశారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ముగ్ధ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న స్టీల్ ఫ్లైఓవర్ పనులను నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేని రహదారుల వ్యవస్థను తీసుకురావడమే లక్ష్యంగా ఈ పనులు జరుగుతున్నాయన్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ సిగ్నల్ ఫ్రీ రాకపోకల కోసం రాబోయే రెండేళ్లలో మొత్తం ఏడు ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ నిర్మాణాలను దశలవారీగా ప్రణాళికబద్ధంగా చేపడుతున్నట్లు వివరించారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి నుంచే ముగ్ధ జంక్షన్ నుంచి కేబీఆర్ పార్క్ వైపు వెళ్లే మార్గంలో ఆరు పిల్లర్ల నిర్మాణ పనులకు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. పగటిపూట ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పనులు ముమ్మరంగా రాత్రివేళల్లోనే కొనసాగుతాయని స్పష్టం చేశారు. పునాది పనులు పూర్తయ్యే వరకే రహదారిపై కొద్దిపాటి అసౌకర్యం ఉంటుందని, ఆ తర్వాత వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయితే కేబీఆర్ పార్క్ పరిసరాలు పూర్తిగా సిగ్నల్ ఫ్రీ జంక్షన్లుగా మారుతాయని, తద్వారా నగరంలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ ప్రాంతాలకు సాఫీగా, వేగంగా ప్రయాణించే వీలుంటుందన్నారు. నిర్మాణ పనుల నేపథ్యంలో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని, వాహనదారులు తమ ప్రయాణ సమయాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని సూచించారు. రద్దీని నివారించేందుకు వీలైనంత వరకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును వినియోగించుకోవాలన్నారు. పనులు ప్రారంభమైన రెండు, మూడు రోజుల పరిస్థితులను బేరీజు వేసుకుని అవసరమైన మార్గాల్లో మార్పులు చేస్తూ ఎప్పటికప్పుడు తాజా ట్రాఫిక్ అడ్వైజరీలు జారీ చేస్తామని వెల్లడించారు. నగరాభివృద్ధికి ఉద్దేశించిన ఈ పనుల సమయంలో వాహనదారులు, జీహెచ్ఎంసీ, మెఘా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆయన నిర్మాణ ప్రాంతాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీపీ(ట్రాఫిక్) డి.జోయల్ డెవీస్, జాయింట్ సీపీ(స్పెషల్ బ్రాంచ్) ఎస్ఎం విజయకుమార్, డీసీపీ(ట్రాఫిక్) కాజల్ సింగ్, జూబ్లీహిల్స్ డీసీపీ రమణారెడ్డి, అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఎసిపి కట్టా హరిప్రసాద్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతోపాటు మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రతినిధులు రాంబాబు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కెబీఆర్ చుట్టూ జరిగే అభివృద్ధి పనుల ప్లాన్ చూస్తున్న సజ్జనార్, జోయల్ డేవిస్, విజయ్‌కుమార్ తదితరులు

రాష్ట్రపతి నిలయంలో జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు

అల్వాల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో విజ్ఞాన దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులు పాటు జరిగే ఉత్సవానికి నగరంలోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులుతో పాటుగా యువ శాస్త్రవేత్తలు, విద్యా వేత్తలు తరలివచ్చారు. వేడుకలు మొదటి రోజు 2వేలు మంది విద్యార్థులు శాస్త్రీయ ప్రయోగాలు, ప్రత్యక్ష ఆవిష్కరణలను ప్రదర్శించారు. నిపుణుల ఉపన్యాసాలు, వర్క్‌షాపులు, విద్యా ఉపన్యాసాలు జరిగాయి. యువలో సృజనాత్మకమైన శాస్త్రీయమైన అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని రాష్ట్రపతి నిలయం మేనేజర్ డాక్టర్ రజని ప్రియ పేర్కొన్నారు. సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ బి.సి ఫరిదా ప్రధాన అతిథిగా, డిఆర్‌డిఎల్ మాజీ శాస్త్రవేత్త పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రమౌళి మరో గౌరవ అతిథిగా విచ్చేశారు. మీట్ ది సైంటిస్ట్ కార్యక్రమంలో బాగంగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, మిషన్లకు సంబంధించి అవగాహన కల్పించడం జరిగింది. భారతీయ కళలు ద్వారా విజ్ఞానం అనే అంశంపై సైన్స్ కమ్యూనికేటర్, బాల సాహిత్య రచయిత్రి, వీర నారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం జన్యు శాస్త్ర విభాగ అధ్యాపకురాలు డాక్టర్ రోహిణి చింత వర్క్ షాప్ నిర్వహించారు. పోస్టర్లు తయారీ, శాస్త్రీయ మోడల్ ప్రదర్శనలు, క్విజ్ పోటీలు జరిగాయి. విద్యార్థులు శాస్త్రవేత్తలు, నిపుణులుతో నేరుగా సంభాషిస్తూ సాంకేతిక పురోగతిపై తమకు ఉన్న ఆలోచనలను వారితో పంచుకుంటున్నారు.

డ్రోన్‌ను పరిశీలిస్తున్న సందర్శకుడు

రెండవ శుక్రవారం మక్కామసీదులో ప్రత్యేక ప్రార్థనలు

చార్మినార్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : చారిత్రక మక్కామసీదులో పవిత్ర రంజాన్ మాసంలోని రెండవ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మక్కామసీదు ఖతీబ్ రిజ్వాన్ ఖురేషీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాగా రంజాన్ మాసంలోని రెండవ శుక్రవారం మక్కామసీదులో సున్నీఉల్మా బోర్డు ఆధ్వర్యంలో యౌముల్ ఖురాన్ పఠనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉర్దూ అకాడమీ చైర్మన్ సయ్యద్ షా నూరల్ హక్ ఖాద్రి, జామైతుల్ మోమినాధ్ అధ్యక్షులు మహ్మద్ మస్తాన్ వలీతో పాటు సున్నీ ఉల్మా బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. మక్కామసీదులో శుక్రవారం జరిగిన ప్రార్థనలు సందర్భంగా చార్మినార్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మక్కామసీదులో జరిగిన ప్రార్థనలో పాల్గొన్న సున్నీ ఉల్మా బోర్డు ప్రతినిధులు

ఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో బిజెపి కార్పొరేటర్ల పూజలు

బేగంపేట ఫిబ్రవరి 27,ప్రభాతవార్త : రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ కార్పొరేటర్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు యన్.రాంచందర్‌రావుతో కల్సి సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డి, మాజీ శాసన సభ్యులు విజయ్ పాల్‌రెడ్డి, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు యం.జయశ్రీ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదా రాణిరెడ్డి, జనగాం మున్సిపల్ వైస్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్ నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ ,బీజేపీ రాష్ట్ర యువనాయకులు మర్రి పురురవారెడ్డి, బీజేపీ నాయకులు రాజేశ్వర్ దేశ్ పాం డే, స్థానిక డివిజన్ అధ్యక్షులు సందీప్ వర్మ, ఎస్సార్ మల్లేష్, దయానందరావు, చీరె శ్రీకాంత్, అనీష్‌వర్మ, శ్రీనివాస్ యాదవ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసిన రాజేంద్రనగర్ జెడ్సి మందా మకరందు

హైదరాబాద్, ఫిబ్రవరి 27,ప్రభాతవార్త: రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మందా మకరందు శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్‌ను హెడ్ ఆఫీస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మందా మకరందుకు కమి షనర్ శుభాకాంక్షలు తెలిపారు. రాజేంద్ర నగర్ జోన్ లో ప్రగతిలో అభివృద్ధి కార్యక్రమాలు, సానిటేషన్, తదితర అంశాలను చర్చించారు. అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు, సానిటేషన్ కార్యకలాపాలు క్షేత్ర స్థాయిలో మరింత ప్రభావవం తంగా చేపట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ కు కమిషనర్ దిశా నిర్దేశం చేశారు.

కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ మందా మకరందు

ఎంటినగర్‌లో పర్యటించిన ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

పారుశుధ్య సమస్యను తెలుసుకుంటున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

నాచారం ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమీషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి హెచ్ఎంటి నగర్, నాచారం సర్కిల్‌లో ఆకస్మిక పర్యటించారు. ఉదయం నాచారం సర్కిల్‌లోని హెచ్ ఎంటి నగర్ లో ఆకస్మిక పర్యటన చేశారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ఆ ప్రాంతంలో పారిశుధ్యం ఎలా ఉందో వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. రోడ్డు పక్కన హరిత వ్యర్థాలు గానీ, హానికరమైన వ్యర్థాలు గానీ మరియు భవన నిర్మాణ వ్యర్థాలు గాని లేకుండా చూడాలని డిప్యూ టీ కమిషనర్, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. హెచ్ ఎం టి నగర్ లోని చెరువును సందర్శించి గుర్రపు డెక్కను పూర్తిగా తొలగిం చాలని ఆదేశించారు. చెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. న

మాదిగ జాతి ఐక్యంగా రాజ్యాధికారం కోసం కృషి చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నరసింహులు

సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగ జాతి హక్కుల కోసం ఏకం కావాలని రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మోత్కుపల్లి నరసింహులు పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకు మాదిగలపైన నమ్మకం లేదని, రాజకీయాలు చేయడం మాదిగలకు చేతకాదని అందుకే వెనుకబడి పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మాదిగ హక్కుల దండోరా ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ ఇచ్చిన ఓటు హక్కు ద్వారా రాజ్యాధికారాన్ని సాధించాలని, ఓట్లును డబ్బులకు అమ్ముకోరాదని పిలుపునిచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో మాదిగ ప్రజా ప్రతినిధులు అధికంగా ఉండాల్సిందని, కాని రాష్ట్రం నుంచి ఒక ఎంపి కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. విడిపోయిన మాదిగ సంఘాలన్ని ఒకటి కావాలని, ఈ వేదిక ద్వారా కృష్ణమాదిగకు విజ్ఞప్తి చేసున్నానని చెప్పారు. వచ్చే మూడేళ్ళలో మాదిగల బలం చూపిద్దామన్నారు. మాదిగ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ 2021లో స్థాపించిన తమ పోరాట సమితి కులాలతో సంబంధం ఎస్సీ,ఎస్టీ,బిసిల హక్కుల సాధన కోసం కృషి చేసిందని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ ప్రీతం, సమితి ప్రధాన కార్యదర్శి రామకృష్ణ,మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు రోజారాణి, ప్రముఖ కవి, వాగ్గేయకారుడు చిలుకా భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో బంగారు రజిత పతకాలు సాధించడం అభినందనీయం : వడ్డేపల్లి

ఆయేషాను అభినందిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

జిల్లాస్థాయిలో బాలనగర్‌కు చెందిన ఆయేషా బంగారు రజిత పథకాలు సాధించడం అభినందనీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. బాలనగర్ డివిజన్‌కు చెందిన ఆయేషా ఇటీవల మహబూబ్ నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని స్వర్ణ, రజత పతకాలు సాధించి విజేతగా నిలిచింది. తన భవిష్యత్ క్రీడా ప్రస్థానానికి సహాయసహకారాలు అందిస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావుని శుక్రవారం ఆమె వారి నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆయేషాను అభినందిస్తూ క్రీడల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కృషి, పట్టుదల, నియమం ఉంటే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించగలవని ప్రోత్సహించారు. భవిష్యత్తులో ఆమెకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేందర్ రెడ్డి, రమేష్, శివరంజని, రూప, మధు, పష్యం శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డి, అనిల్ ఆయేషా కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తలి సభ్యులకు సన్మానం

సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: సీతాఫల్‌మండి నామాలగుండులోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం ధర్మకర్తల అభినంద సభ శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, కంటెస్టడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు. వేద పండితుల సమక్షంలో చైర్మన్ కాచం రాము, ధర్మకర్తల మండలి సభ్యులుగా మున్నూరు చందు, కైలాస్ అరుణ్ కుమార్, నరేష్, ప్రవీణ్, ప్రతాప్, శ్యామల రమణి తదితరులు పదవి బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో నోముల ప్రకాష్‌రావు, కుంచాల ఏడుకొండలు, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, మహేందర్, అనిల్, కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు.

హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో 108 కలశాలతో స్వరాభిషేకం

దేవాలయంలో 108 కలశాలతో స్వరాభిషేకం చేస్తున్న ఆలయ చైర్మన్ లక్ష్మణ్‌గౌడ్.

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 26, ప్రభాతవార్త : బోరబండ ఎన్ఆర్ఆర్ పురం సైట్2లోని మల్లన్న స్వామి ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవాలయం 18వ వార్షికోత్సవ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం శుప్రభాత సేవ, శ్రీ లక్ష్మీగణపతి హోమం, 108 కలశాలతో స్వరాభిషేకం, మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం సాయంత్రం దీపారాధన, పడిపూజ మహోత్సవం, శ్రీ సాయి మణికంఠ భజనా మండలి వారిచే భజనా కార్యక్రమం, పడి ప్రజ్వలన, నీరాజనం, మంత్రపుష్పం, హరిహారసనం, అనంతరం భక్తులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాలకృష్ణ, కాశీరావు, విజయ్, సత్యనారాయణ, సోమేష్, గోవింద్, సంజీవ, శ్రీను, మధు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర రంజాన్ మాసంలో సహేరీ

సహేరీలో పాల్గొన్న మాజీ ఉప మేయర్ బాబా ఫసియుద్దీన్.

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : ప్రవిత్ర రంజాన్ మాసంలో ఎంతో భక్తి శ్రద్ధలతో బోరబండ ఎన్ఆర్ఆర్ పురం సైట్1 కాలనీలో గ్రేటర్ మాజీ ఉప మేయర్ బాబా ఫసియుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారుజామున సహేరీ నిర్వహించారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని గత 11 సవంత్సరాలుగా సహేరీ నిర్వహిస్తూ వస్తున్నారని 9వ రోజు కూడా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

1 నుండి నగర వ్యాప్తంగా డ్రైవింగ్ లైసెన్సుల తనిఖీలు

- అరైవ్-అలైవ్‌లో భాగంగా ఉచిత కంటి పరీక్షలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్తః మార్చి 1 నుండి నగరంలో ప్రతి రోజు డ్రైవింగ్ లైసెన్స్ తోపాటు వాహన పత్రాలు తనిఖీలు నిర్వహిస్తామని ట్రాఫిక్ సంయుక్త కమిషనర్ జోయల్ డేవిస్ అన్నారు. జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో అరైవ్-అలైవ్ అవగాహన కార్యక్రమం కింద ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి, బేగంపేటలోని విన్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జలమండలి వాటర్ ట్యాంకర్లు, ఆటో డ్రైవర్లకు సంబంధించి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు కంటి చూపు చాలా ప్రాధాన్యమన్నారు. ప్రతి ఒక్క డ్రైవర్ క్షేమంగా ఇంటికి తిరిగి రావాలి అనే ఉద్దేశంతో రాష్ట్ర డీజీపీ ఆదేశాలతో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రోడ్లపై వాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయన్నారు.డీసీపీ 2 కాజల్ సింగ్ మాట్లాడుతూ.. వాహనదారులు సురక్షితంగా ప్రయాణం చేయాలని, రోడ్డుపై ఎక్కువ సమయం ఉండే డ్రైవర్లు సాయంత్రం క్షేమంగా ఇంటికి చేరాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డిసిపి వేణుగోపాల్‌రెడ్డి, జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఎసిపి కట్టా హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరం రవీందర్, బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కోనంగి సునీల్, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. దాదాపు 200ల మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు కట్టా హరిప్రసాద్ తెలిపారు.

ఉచిత కంటి పరీక్షల కార్యక్రమంలో వై సంయుక్త కమిషనర్ జోయల్ డేవిస్ ఇతర అధికారులు.

కళాబంధు..పరిపాలనా గంధర్వుడు రమణాచారి : జస్టిస్ రాధారాణి

చిక్కడపల్లి ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త) : అరుదైన ప్రజాసేవకుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి" అని రాష్ట్ర వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార కమిషన్ చైర్మన్ జస్టిస్ రాధారాణి శ్లాఘించారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ వేదికగా, జాతీయ కళాకారుల సంఘం అధినేత ఎల్ వి.చిన్నారావు ఆధ్వర్యంలో సంగీత, నృత్య రంగాల్లో అసమాన ప్రతిభ కనబరిచిన ఐదుగురు మేధావులను జస్టిస్ రాధారాణి సంగీత కళా ప్రవీణ బిరుదుతో సువర్ణ సత్కారం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ.. రమణాచారి తన ఐఏఎస్ ప్రస్థానంలో పరిపాలనను కేవలం ఫైళ్లకు పరిమితం చేయకుండా, మానవీయ కోణంలో ప్రజా సమస్యలను పరిష్కరించారని కొనియాడారు. ముఖ్యంగా తెలుగు లలిత కళల పట్ల ఆయనకున్న మమకారం, కళాకారుల శ్రేయస్సు కోసం ఆయన పడిన తపన అసామాన్యమని, అందుకే నేడు పదవీ విరమణ తర్వాత కూడా వేలాది మంది కళాకారులు ఆయనను తమ ఇంటి సభ్యుడిగా భావిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా సంగీత, నృత్యరంగాల్లో అసమాన ప్రతిభ కనబరిచిన ఐదుగురు మేధావులను జస్టిస్ రాధారాణి సంగీత కళా ప్రవీణ బిరుదుతో సువర్ణ సత్కారం చేశారు. పండిట్ జానకీ రాములు, కళా కృష్ణ, ఉమా మహేశ్వరి,డి.వి. మోహన్ కృష్ణ, రాఘవాచారి లను వీరిని సత్కరించడం ద్వారా పురస్కారానికే ఒక నిండుతనం చేకూరిందని సభికులు హర్షం వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన జాతీయ కళాకారుల సంఘం అధ్యక్షులు ఎల్.వి. చెన్నారావు మాట్లాడుతూ.. "నేటి యాంత్రిక జీవనంలో మనిషిలో ఆలోచనా శక్తిని, ఆర్ద్రతను కలిగించే శాస్త్రీయ సంగీతం మరుగున పడిపోతుండటం విచారకరం. మన వాగ్గేయకారులు అందించిన అపురూపమైన సంగీత నిధిని భావి తరాలకు అందించాలనే పవిత్ర లక్ష్యంతోనే ఈ సంస్థ పనిచేస్తోంది" అని వివరించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి జన్మదినోత్సవ వేడుకలు ఒక సాంస్కృతిక పండుగలా జరిగాయి. సభా ప్రారంభంలో నాట్య గురువు శ్రావ్య మానస శిష్య బృందం ప్రదర్శించిన శ్రీనివాస కళ్యాణం నృత్య రూపకం ఆహూతులను భక్తి పారవశ్యం లో ముంచెత్తింది. నాదస్వర గోష్ఠి సభలో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లింది. ఈ సందర్భంగా వేదికపై ఉన్న సాంస్కృతిక సేవకులు శ్రీనివాస్ భోగిరెడ్డి, కె.కె.వి. శర్మ, గీతాంజలి, సుజా రమణలను కూడా ఆత్మీయంగా సత్కరించారు.

డాక్టర్ కెవి.రమణాచారి లను సత్కరిస్తున్న రాష్ట్ర వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార కమిషన్ చైర్మన్ జస్టిస్ రాధారాణి

పరిశోధనలే ప్రగతికి సోపానాలు : వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్

చిక్కడపల్లి ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త) : భారతీయ స్టార్టప్ వ్యవస్థలో యువతను భాగస్వాములను చేస్తూ, సరికొత్త వ్యాపార ఆలోచనలకు ప్రాణం పోసే ఉద్దేశంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం వేదికగా జాతీయ స్థాయి ఎంటర్‌ప్రెన్యూర్ హ్యాకథాన్ శుక్రవారం అట్టహాసంగా నిర్వహించబడింది. చిక్కడపల్లి అరోరా డిగ్రీ , పీజీ కళాశాల, ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం మేధోమథనానికి వేదికైంది. ముఖ్య అతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. విశ్వవిద్యాలయం కేవలం విద్యా బోధనకే పరిమితం కాకుండా, సామాజిక అవసరాలకు డిజిటల్ పరిష్కారాలను అందించడంలో ముందుందని తెలిపారు. ఇందులో భాగంగానే తిరుమల మరియు శ్రీశైలం వంటి ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతాలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం సిద్ధం చేసిన ప్రత్యేక గైడ్ క్యూ ఆర్ కోడ్)లను ఆయన ఆవిష్కరించారు. ఈ కోడ్ల ద్వారా యాత్రికులు మార్గదర్శకాలు, వసతి మరియు ఇతర సమాచారాన్ని సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు. అరోరా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సి. అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతకు పదును పెట్టడానికి ఇటువంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమ ముగింపు సభ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజేతలకు నగదు బహుమతి తో పాటు తమ ఐడియాలను వాణిజ్యపరంగా అభివృద్ధి చేసుకోవడానికి వూటీబీఐపీ ఓ టి బి ఐ లో ఉచితంగా ఇంక్యుబేషన్ స్థలాన్ని కేటాయించారు. కార్యక్రమంలో ఓ టి బి ఐ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాసాగర్, సలహాదారు డాక్టర్ టి. హరినారాయణ్, ప్రతినిధి రమ్య, కన్వీనర్ డాక్టర్ డి. రజనీ గడ్లే, వివిధ విభాగాల అధిపతులు మరియు విద్యార్థి బృందాలు పాల్గొన్నారు.

అడ్డగుట్ట అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అడ్డగుట్ట,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్టలో నెలకొన్న రోడ్లు,డ్రైనేజీ,మంచినీరు వంటి మౌళిక సదుపాయాలు మెరుగుపర్చేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి,వివిధ విభాగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అడ్డగుట్ట,లోహియ నగర్, హుండి బండ నగర్,అడ్డగుట్ట బి సెక్షన్,ఆర్.ఆర్.సీ.గ్రౌండ్,అడ్డగుట్ట సెంటర్‌లో నిర్మించిన మల్టీపరపస్ ఫంక్షన్ హాల్‌ను,స్వామి వివేకానంద కమ్యూనిటీ హాల్ పరిసరాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈస్ట్ మారేడ్‌పల్లి టీచర్స్‌కాలనీ నుంచి ఆర్.ఆర్.సీ.గ్రౌండ్ మీదుగా తుకారాంగేట్ పహాడి హన్‌మాన్ దేవాలయం వరకు రహదారిని ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలు,వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి జిహెచ్ఎంసి, జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడ్డగుట్ట డివిజన్ బిజెపి అధ్యక్షురాలు గాజుల సౌందర్య, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి, మహంకాలి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని, నాయకులు నాగేశ్రెడ్డి, కనకట్ల హరి,వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్, మేకల కీర్తి హర్ష వర్ధన్, అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బిజెపి నాయకులు హంసరాజ్,గెల్లు ఉదయ్‌యాదవ్, జె. రాజేశ్, గంబీరావ్ పేట సాయన్న, రాజు, సాయిబాబా, శివలింగ చారి,వేణుగోపాల్‌తో పాటు జిహెచ్ఎంసి, జల మండలి, రెవెన్యూ,విద్యుత్,పోలీస్ వంటి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అడ్డగుట్ట బస్తీ బాటలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు

పరస్పరం సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలకు పరిష్కారం

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : పరస్పరం సమన్వయంతో పనిచేసి సమస్యలకు పరిష్కారం చూపాలని నగర ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, జీహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిలు అధికారులను ఆదేశించారు. ఇర్వురి ఆధ్వర్యంలో శుక్రవారం నర్కి పుల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్, ఇంజనీరింగ్, ప్రాజెక్ట్స్, అర్బన్ బయోడైవర్సిటీ, విద్యుత్, జలమండలి అధికారులతో సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు ప్రధానంగా రోడ్లపై నెలకొన్న గుంతలు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు, జీబ్రా క్రాసింగ్, రోడ్లపై నిలిపి ఉంచిన పాత వాహనాలు, అభివృద్ధి పనుల నిమిత్తం తవ్వి వదిలేసిన రోడ్లు, ట్రాఫిక్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అధికారులు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయ పరచుకోవాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లకు వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు పలు విభాగాలతో కలిసి చర్యలు చేపడతామన్నారు. రోడ్లపై పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, విద్యుత్ స్తంభాల తొలగింపు, సిగ్నల్స్ లైన్ క్రాసింగ్ కలరింగ్ చేపట్టాలన్నారు. మలక్‌పేట్, సైదాబాద్, చార్మినార్, దారుల్‌షిఫా, ఎంజీబీఎస్, అజంపుర, సంతోష్‌నగర్, నల్గొండచౌరస్తా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్‌యంసి చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులు సూచించిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ ద్వారా అందిన 1140 ఫిర్యాదులపై తక్షణమే స్పందించి ఇప్పటి వరకు 950 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఈ సమావేశంలో నగర్ ట్రాఫిక్ 3 డీసీపీ రామదాసు, చార్మినార్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్, మలక్ పేట్, సంతోష్‌నగర్, ముసారంబాగ్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు ఇంకేషఫ్ అలీ, మంగతయారు, భాస్కర్‌రెడ్డి, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ ఇందిరా, జల మండలి సీజీఎం జాన్ షరీఫ్, చార్మినార్, మీర్‌చౌక్, ఛత్రినాక, మలక్‌పేట్, సైదాబాద్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు శేఖర్, రాంబాబు, సంతోషం, రామకృష్ణ, సత్యనారాయణ, చార్మినార్ సర్కిల్ ఈఈ సనావుద్దీన్, డిఈలు, ఏఈలు, యూబీడీ, టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న నగర ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిలు

పోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు శిక్ష

సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: ప్రేమ పేరుతో బాలిక వెంటపడి వివాహం చేసుకుంటానని మోసం చేసి లైంగిక దాడికి పాల్పడిన యువకుడికి కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. అదేవిధంగా రూ.15 వేల జరిమానా విధించడంతో పాటు బాదితురాలికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ పోక్సో కేసుకు సంబంధించి తీర్పు గురువారం వెల్లడైంది. వివరాల్లోకి వెళ్తే.. సైదాబాద్‌కు చెందిన బ్యాగర సంతోష్ (26) అనే యువకుడు 17 సంవత్సరాల బాలికను ప్రేమ, పెళ్ళి పేరుతో వంచించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి తరపున ఫిర్యాదు అందడంతో కేసును నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసును నమోదు చేశారు. సమర్థవంతంగా దర్యాప్తు చేసిన పోలీసులు బాధితురాలి వాంగ్మూలం, వైద్య పరీక్షల నివేదిక, ఫోరెన్సిక్ సాక్ష్యాలు కోర్టుకు సమర్పించారు.దీంతో నిందితునిపై అభియోగాలు రుజువు కావడంతో న్యాయమూర్తి కఠిన శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

ముద్ర రుణం పేరుతో ఆత్మహత్యకు కారణమైన వారిని అరెస్టు చేయాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: బ్యాంక్ నుంచి రుణం ఇస్తానని మాయమాటలతో లోబరుచుకుని అత్యాచారం చేసి ఒక గిరిజన మహిళ ఆత్మహత్యకు కారణమైన డిసిసిబి మేనేజర్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, ఆయనకు మద్దతుగా నిలిచి కేసు నమోదు చేయకుండా వత్తాసు పలుకుతున్న ఎస్ఐ, సిఐ, డిసిపిలపైన కూడా ఎస్టీ కమిషన్ సభ్యుడి ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని లంబడీ హక్కుల పోరాట సమితి (నంగారా భేరి), బంజారా సేవాలాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున లంబాడీలు ఆందోళనలు చేపడతారని ఆసంఘాల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నంగారా భేరీ జాతీయ అధ్యక్షుడు గణేష్‌నాయక్, సేవాలాల్ బంజారా సంఘం జాతీయ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ తదితరులు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం, టేకులపల్లి మండలం, కొత్త తండా గ్రామానికి చెందిన బానోతు సౌందర్య ముద్ర రుణం కోసం స్థానిక డిసిసిబి బ్యాంక్‌లో దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. బ్యాంక్ మేనేజర్ ఆమెకు రుణం ఇప్పిస్తానని చెప్పి మాయ మాటలతో చాలా రోజులుగా పాటుగా అత్యాచారం చేశారని ఆరోపించారు. అంతేకాకుండా బాంక్ మేనేజర్ ఇద్దరు పిల్లల తల్లి అయిన ఆమెను పెళ్ళి చేసుకుంటాను భర్తకు విడాకులు ఇవ్వమని వేధించాడని వారు ఆరోపించారు. దీంతో ఆమె మానసికంగా కుంగిపోయి గత ఏడాది నవంబరు 28న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆమె భర్త, బందువులు టేకుల పల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ, సిఐ, డిసిపికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా మేనేజర్‌కు వత్తాసు పలికారని వారు ఆరోపించారు. దీంతో తాము జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, కమిషన్ సభ్యుడు హుషేన్ వారిపైన ఎస్సీ, ఎస్టీ కేసు నామోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికి ప్రభుత్వం పటించుకోలేదని ధ్వజమెత్తారు. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి సిగ్గు లేకుండా ఆమె భర్తకు రాయభారం పంపారని వారు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని వారిపైన చర్యలు తీసుకుని కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సౌందర్య, భర్త, ఇద్దరూ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గణేష్‌నాయక్, చిత్రంలో సౌందర్య భర్త, పిల్లలు

నమ్మించాడు.. కిలో బంగారం కాజేశాడు

- బంగారం దుకాణ వ్యాపారిని బురిడీ కొట్టించిన పాత నేరస్థుడు

- బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్తః బంగారం వ్యాపార దుకాణం నిర్వహించే ఒక మహిళను నమ్మించి కిలో బంగారం మోసానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మై హోం భూజాలో నివసించే పాలకుర్తి లక్ష్మీ కావ్యకు బంజారాహిల్స్ రోడ్ నంబరు 2లో స్వర్ణ కావ్యం పేరుతో బంగారు ఆభరణాల దుకాణం ఉంది. ఆమెకు సామాజిక మాధ్యమం ద్వారా అంకిత్ అలియాస్ శ్రీనాథ్ రాఠీ పేరుతో ఒక వ్యక్తి పరిచయమయ్యాడు. తాను సోషల్ ఎలైట్, ఫిక్కి మాజీ అధ్యక్షురాలైన పింకీరెడ్డి వ్యక్తిగత సహాయకుడినని నమ్మించాడు. తాము చేసే వ్యాపారంలో భాగంగా బంగారు ఆభరణాలు సేకరించి బంగారు బిస్కెట్ రూపంలో ఇస్తామని నమ్మించాడు. దీంతో ఆమె ఈ నెల 19న 136 గ్రాముల ఆభరణాలు తీసుకొని అందుకు ప్రతిగా చెక్కులు ఇచ్చాడు. మరుసటి రోజు ఆమెకు దా

ప్రభుత్వ నిధులతో ఓపెన్ జిమ్ : ఎమ్మెల్యే శ్రీగణేష్

బొల్లారంలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో భాగంగా బొల్లారం ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం 8వ వార్డు బొల్లారం డౌటన్ బజార్ స్నేహ ఎన్‌క్లేవ్ కాలనీ పార్కులో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులు ఓపెన్ జిమ్‌ను ఉపయోగించుకొని ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ఆయా బస్తీల్లో నెలకొన్న సమస్యలను నవకంటోన్మెంట్ నిర్మాణ బాట ద్వారా తెలుసుకొని సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు వాసుదేవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సింహ్మ కన్నన్,వేణుగోపాల్ రెడ్డి, బాల్‌రాజ్, ఖదీర్ వన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల వ్యయంతో సిసి కెమేరాలు : సంతోష్ యాదవ్

రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో సీసీ కెమరాలను ఏర్పాటు చేస్తున్న కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట,ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: కంటోన్మెంట్ మోండా డివిజన్ లోని రైల్ నిలయం అంబేద్కర్ బస్తీ వాసుల కోర్కెల మేరకు తన సొంత నిధులతో రూ.2 లక్షల వ్యయంతో సీసీటీవి కెమరాలను ఏర్పాటు చేస్తున్నామని మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ నగర్‌లోని ప్రధాన రహదారుల్లో సీసీటీవి కెమరాల ఏర్పాటుకు వైరింగ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్.డి.నాగేశ్ యాదవ్, బస్తీ నాయకులు డి.బాబురావ్, పి.నర్సింగ్ రావ్, రాపర్తి శివ, పూజారి సాంబయ్య పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం బిజెపి పని చేస్తుంది : వడ్డేపల్లి రాజేశ్వరరావు

వడ్డేపల్లిని కలిసిన బిజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వర రావు పేర్కొన్నారు. అఖిల భారత ఆరెకటిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అత్తికారి మల్లేశ్ ఇటీవల బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సమక్షంలో పార్టీలో చేరిన శుభ సందర్భంగా శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మల్లేశ్ ఆయన మిత్ర బృందాన్ని పార్టీలోకి స్వాగతించి సమాజ సేవకు రాష్ట్రాభివృద్ధికి బీజేపీ వేదికగా మరింత విస్తృతంగా సేవ చేసే అవకాశాన్ని అందిపుచ్చుకున్నందుకు అభినందించారు. మంచి నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా వారిని ప్రశంసించారు. దేశ అభివృద్ధి, సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించడమే పార్టీ లక్ష్యమని, మల్లేశ్ చేరికతో పార్టీ మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సురేందర్ రెడ్డి, బాలనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రమేష్, బిజెపి సీనియర్ నాయకులు శివరంజని, రూప, అర్జున్, సురేందర్, బోయిరాజులు, కుమార్, బాలస్వామి, రాము, అనిల్, వినోద్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ ,సిల్వర్ మెడల్ సాధించిన యువతికి అభినందనలు

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ బాలనగర్ డివిజన్ మైనారిటీ మహిళా నాయకురాలు సమీనా బేగం కూతురు పదవ తరగతి చదువుతున్న అయూషా బేగం బాక్సింగ్ పోటీలో ఒకటి సిల్వర్, రెండు గోల్డ్ మెడల్స్‌లను అతి తక్కువ సమయంలో సాధించిన సందర్భంగ కూకట్‌పల్లి బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావుని వెళ్లి కూకట్పల్లి బిజెపి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కాంతారావు శాలువాతో సన్మానించి కేంద్ర ప్రభుత్వం ద్వారా స్పోర్ట్స్‌కు సంబంధించి సహాయము కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తామని మాట ఇచ్చారు. మా నినాదం సబ్కా సాత్, సబ్కా వికాస్, అందరూ సమానమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాయినేని సూర్యప్రకాశరావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సురేందర్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు జి ఆర్ రమేష్ , మాజీ మహిళా అధ్యక్షురాలు శివరంజని, డివిజన్ జనరల్ సెక్రెటరీ మధు, ప్రదీప్ రెడ్డి, సంధ్య, రూప తదితర నాయకులు, నాయకురాలు పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి

-మూల వెంకటేష్ గౌడ్

మూల వెంకటేష్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు అభిమానులు

జీడిమెట్ల, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

నిరుపేదలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి కలుగుతుంది అని ప్రముఖ సంఘ సేవకులు ఎం.వి.ఆర్ గ్రూప్ చైర్మన్ మూల వెంకటేష్ గౌడ్ తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలిలో అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై ఆయన ప్రసంగించారు. పేద ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకలకు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘసంస్కర్త

చిక్కడపల్లి ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త) : సంత్ సేవాలాల్ మహారాజ్: గొప్ప సంఘసంస్కర్త అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బాలింగంపల్లి లంబడి తండా బస్తీ కమిటీ అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం లంబాడి తండా బస్తీలో బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతి సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, అనిల్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రవి చారి, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్య క్షుడు భూక్య సంజీవ్ నాయక్, చిన్న శ్రీశైలం యాదవ్ తదితరులు హాజరై నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ గిరిజను లతో పాటు సమాజంలో ఉన్న అందరినీ తనబోధనల ద్వారా చైతన్యపరిచారని అన్నారు. సేవాలాల్ జయంతిని గత గత ప్రభుత్వం నుంచి అధికా నిర్వహిస్తున్నారని తెలిపారు.ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దేవం సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆచరణీయమని అన్నారు. సేవాలాల్ అందరికీ ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. అనం తరం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. , నారాయణ,దేవేందర్ నాయక్, బాలు బాలు

పాల్గొన్న ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

నాయక్, నారాయణ, నవీన్ నాయక్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్ ముదిరాజ్, దామోదర్ రెడ్డి, నాయకులుముచ్చకూర్తి ప్రభాకర్, కిషన్ రావు, వివేక్ తదితరులు పాల్గొన్నారుసంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన..సంత్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం నిర్మాణం కోసంస్థానిక లంబాడి బస్తీ ప్రజల కోరిక మేరకు ఈ సందర్భంగా బస్తీ సమీపంలో ఉన్న హౌసింగ్ బోర్డ్ కు సంబంధించిన స్థలాన్ని ఎమ్మెల్యే ముటాగోపాల్, డాక్టర్ లక్ష్మణ్, స్థానిక మాజీ కార్పొరేటర్ రవి చారి సందర్శించారు.

వాహన డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలు : ట్రాఫిక్ డిసిపి కాజల్

అఫ్జల్‌గంజ్,ఫిబ్రవరి 27ప్రభాతవార్త: రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగాహైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు భారీ వాహన డ్రైవర్లకు 'ఆరైన్ అలైన్,సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు .నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలోని గాంధీ సెంటనరీ హాల్‌లో అరైన్ అలైన్ రెండవ దశ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.సుమారు 150 మందిభారీవాహనా డ్రైవర్లకు అవగాహన సదస్సు చేపట్టి వారికి ఉచితంగా కంటి వైద్యపరీక్షలను చేపట్టారు.హైదరాబాద్ ట్రాఫిక్-2 డిప్యూటి కమీషనర్ కాజల్(ఐపిఎస్) మాట్లాడుతూ రహదారిభద్రతలో భాగంగా మొదటి దశ పూర్తి చేసుకున్న తర్వాత రెండవ దశను చేపట్టడం జరిగిందన్నారు.రహదారి భద్రతలో కీలకమైన డ్రైవర్ల దృష్టి ఆరోగ్యాన్ని మెరుగపర్చడానికిఇ మెడివిజన్ ఐ కంటి ఆసుపత్రి సహకారంతో భారీ వాహన డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్యపరీక్షలుచేపట్టం జరిగిందన్నారు.గత ఏళ్లగా ప్రమాద రహితంగా సేవలు అందిస్తున్న ఇద్దరు సీనియర్ డ్రైవర్లును డిసిపి కాజల్ శాలువ కప్పి సన్మానించారు.

ట్రాఫిక్ పోలీసు ఆధ్వర్యంలో భారీ వాహన డ్రైవర్లకు అరైన్ అలైన్ భాగంగా ఉచిత కంటివైద్య శిభిరం

భద్రత నిబంధనలు 150మందికి భారీ వాహన డ్రైవర్లకు సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతను వివరించారు. మధ్యపాన సేవించి చేసి వాహనంనడుపరాదని,డ్రైవింగ్ చేసేటప్పుడు మెఎబైల్ ఫోన్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలన్నారు .ట్రాఫిక్ క్రమశిక్షణ రాంగ్‌రూట్,డ్రైవింగ్,ఎడమవైపు నుండి ఓవర్‌టేక్ చేయడం వంటి ప్రమాదకరమైన చర్యల పట్ల డ్రైవర్లను హెచ్చరించారు.ఈకార్యక్రమంలో ఎసిపి ట్రాఫిక్ ధనలక్ష్మి,గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, కుల్సుంపురా ట్రాఫిక్ సిఐ రాజేంద్రప్రసాద్, ఆసిఫ్‌నగర్ ట్రాఫిక్ సిఐ రుక్మిణి,ఎస్ఐలు,సిబ్బంది పాల్గొన్నారు.

నేటి ఆలోచన రేపటి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

: భీమ్ రాజ్ సేన వ్యవస్థాపకుడు కాంబ్లే రాజేష్

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

నేటి ఆలోచన రేపటి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం క్రమశిక్షణతో, నిరంతర సాధన కలిగి ఉండాలని భీమ్ రాజ్ సేన వ్యవస్థాపకుడు కాంబ్లే రాజేష్ అన్నారు. శుక్రవారం ఉమాదేవి నగర్, జగద్గిరి గుట్ట 126 డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో భీమ్ రాజ్ సేన వ్యవస్థాపకుడు కాంబ్లే రాజేష్ తన బృందంతో కలిసి విద్యార్థుల కోసం ప్రత్యేక భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ పిల్లలు, పాఠశాల అధికారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల కోసం ఒక ఉపాధ్యాయుడిని స్పాన్సర్ చేస్తానని గతంలో ఇచ్చిన మాటకు రాజేష్ నిలబెట్టుకున్నాడు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని సూచించారు. రాబోయే రోజుల్లో పాఠశాల భవనం యొక్క పూర్తి పునరుద్ధరణ పనులు ప్రారంభమవుతాయని ఆయన హామీ ఇచ్చారు.

ఘనంగా నల్లపోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవం

ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ.50,000ల చెక్కును అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

రాజీవ్ గాంధీ నగర్ కాలనీలో శుక్రవారం శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాల్లో 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తదనంతరం ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ.50, 000లను ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ పరిసరాల అభివృద్ధి, సదుపాయాల విస్తరణ కోసం తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ పెద్దలు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం : ఎంపీ ఈటల రాజేందర్

ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం నిజాంపేట సర్కిల్ పరిధిలోని డంపింగ్ యార్డ్, చెత్త సేకరణ సరిగలేక దోమల వలన ప్రజలు పడుతున్న ఇబ్బందులను నిజాంపేట బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్ మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డ్ చెత్త సేకరణ ప్రామాణికంగా జరిగే విధంగా తగిన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ పాండు, బీజేవైఎం అధ్యక్షులు రాజేష్ ముదిరాజ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న ఖైరతాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి

అరకొర వసతులతో రోగుల ఆవేదన

ఖైరతాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త): ఖైరతాబాద్ ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రి (వెల్నెస్ సెంటర్)లో సరైన వసతులు లేకపోవడంతో రోగులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా ఆసుపత్రి పరిస్థితుల్లో పెద్ద మార్పు కనిపించలేదని స్థానికులు అంటున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం, అనంతరం బిఆర్ఎస్ ప్రభుత్వం, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ రోగులకు అవసరమైన సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో పరికరాల కొరత, మందుల సరఫరా లోపం, లిఫ్ట్ సరిగా పనిచేయకపోవడం వంటి సమస్యలు రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. నాలుగు అంతస్తుల భవనం ఉన్నప్పటికీ, తగిన సదుపాయాలు లేక వెలవెలబోతున్న దృశ్యం కనిపిస్తోందని కొందరు అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

షెడ్డు పనులను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 27 (ప్రభాతవార్త): ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని డివిజన్ ప్రాంతంలో ఉన్న శ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి ఎదురుగా నిర్మించనున్న షెడ్డు పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి. విజయారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అధికారులతో సమన్వయం సాధిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు మెరుగుపడేలా ఈ షెడ్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : టీజీఎస్ఆర్టీసి ఫలక్‌నుమా డిపో పరిధిలో ఈనెల 28వ తేదీ శనివారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ డిపో మేనేజర్ ఎన్.రమేష్ తెలిపారు. సాయంత్రం 4గంటల నుండి 5గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో సంస్థ ఉన్నతికై అమూల్యమైన సూచనలు, సలహాలతోపాటు సమస్యలను మొబైల్ నెంబర్ 99592 26131 ద్వారా తెలియజేయాలని కోరారు. డిపో పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని పేర్కొన్నారు.

భరత మాత ముద్దుబిడ్డ చంద్రశేఖర్ ఆజాద్ : డాక్టర్ దాసి నాగరాజు

నిజాంపేట్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో అజేయ వీరుడిగా నిలిచిన చంద్రశేఖర్ ఆజాద్ భరత మాత ముద్దుబిడ్డ గా దేశ ప్రజలచే కీర్తించబడ్డారని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు తెలిపారు. శుక్రవారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా నిజాంపేట్‌లోని వారి కార్యాలయంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్ర పటానికి దాసి నాగరాజు మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి, అనిల్ కమలాకర్, భవాని, సుహర్షిణి, శివాజీ, మణికంఠ, దుర్గప్రసాద్, నిహారిక, వంశీ,ప్రేమ్‌సాయి పాల్గొన్నారు.

నిద్ర మాత్రలు మింగి మహిళ ఆత్మహత్య

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త : ఓ మహిళ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట షిరిడిహిల్స్ ప్రాంతానికి చెందిన దివ్యరెడ్డి (33) అలియాస్ జ్యోతి ఆత్మహత్యకు పాల్పడింది. భర్తతో జరిగిన గొడవ కారణంగా మనస్తాపం చెందిన ఆమె ఉదయం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించిగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త నరసింహా వేధింపుల వల్లే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం : జోనల్ కమిషనర్ మందా మకరందు

నార్సింగి, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని రాజేంద్రనగర్ జోనల్ కమీషనర్ మందా మకరందు పేర్కొన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్షాకోట్ డివిజన్ పీజీ కాలనీలో రాజేంద్రనగర్ డిసి సురేందర్‌రెడ్డితో కలిసి జడ్‌సి పర్యటించారు. కాలనీల లోని ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి చెత్త సేకరణ, పరిశుభ్రత, పారిశుద్యం వంటి విషయాలపై ఆరా తీశారు. పీజీ కాలనీలో పెంటయ్య తో మాట్లాడారు. చెత్త సేకరణ కోసం ఆటోలు ఇంటింటికి క్రమం తప్పకుండా వస్తున్నాయా? రోడ్లపై నిత్యం పారిశుద్య సిబ్బంది చెత్తను ఎత్తుతున్నారా? లేదా? అని జడ్‌సి వివరాలను సేకరించారు. క్రమం తప్పకుండా మా ప్రాంతంలో చెత్త ఆటోలు వస్తున్నాయని, సిబ్బంది సవ్యంగానే పని చేస్తున్నారని జడ్‌సికి పెంటయ్య వివరించారు. రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వాహనాలు దూసుకు వస్తున్నాయని, దేవాలయాలకు వెళ్లే భక్తులు తరుచూ ప్రమాదాల పాలువు తున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని, తడి, పొడి చెత్తను వేరు చేసే బుట్టలను పంపిణీ చేయాలని పెంటయ్య జడ్‌సిని కోరారు. అనంతరం జడ్‌సి మాట్లాడుతూ ప్రజలందరూ తమ ఇళ్లను శుభ్రం చేసుకొని తడి,పొడి చెత్తను వేరు చేసి ఆటోల్లోనే వేయాలని, రోడ్ల పక్కన వేస్తే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఇళ్లు, ఇంటి పరిసరాలు పరిశు భ్రంగా ఉంచుకుంటేనే అంటు వ్యాధులు రాకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పారిశుద్య జవాన్‌లు, చెత్త ఆటో కార్మికులు పాల్గొన్నారు.

హైదర్షాకోట్ డివిజన్‌లో పారిశుద్యంపై స్థానిక ప్రజలను అడిగి సమాచారం సేకరిస్తున్న చార్మినార్ జోనల్ కమిషనర్ మందా మకరందు దృశ్యం.

ఎక్సైజ్ శాఖలో కానిస్టేబుళ్లను బదిలీ చేయాలి : యుగేంధర్‌గౌడ్

సైఫాబాద్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: గత ఎనిమిదిన్నర సంవత్సరాలుగా ఎక్సైజ్ శాఖలో పెండింగ్‌లో ఉన్న కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని బిసి పొలిటికల్ జెఎసి రాష్ట్ర ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖలో మరుగున పడిన బదిలీల అంశంపై తమ జెఎసి గత రెండు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నదని, ఇందులో భాగంగానే సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి, సిఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమీషనర్ దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకే చోట ఎనిమిదిన్నర సంవత్సరాలు పనిచేసిన కానిస్టేబుళ్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్త చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతి పత్రాన్ని సమర్పించడం జరిగిందని, ఇందకు స్పందించిన ఆయన వారం రోజుల్లో బదిలీ ప్రక్రియను ప్రారంభిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే కొంత మంది అధికారులకు ప్రభుత్వం పదోన్నతులు ఇచ్చినప్పటికి పోస్టింగ్స్ ఇవ్వకుండా జాప్యం చేసిందని, వెంటనే పోస్టింగ్స్ ఇవ్వాలని కోరారు. రెండు, మూడు పోస్టులకు ఒకే అధికారి నిర్వహించడం వల్ల పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తడమే కాకుండా ప్రజలకు, ప్రభుత్వానికి ఇబ్బందులు వస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను బదిలీలు, పోసింగ్స్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెఎసి నాయకులు రవీందర్‌గౌడ్, యశ్వంత్, మల్లేష్, వినోద్‌సాగర్, శ్రీధర్, రాకేష్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

ప్రజా సమస్యలపై ప్రభుత్వ చర్యలు శూన్యం : బాలరాజ్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత నల్లెల్ల కిషోర్

ముషీరాబాద్, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: ప్రజా సమస్యలపై ప్రభుత్వ చర్యలు శూన్యంగా ఉన్నాయని టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్‌లు ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నగరంలో దోమల ఎక్కువయి, ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నా, వేసవి సమీపిస్తూ నీటి ఎద్దడి ప్రారంభం అవుతున్నా, ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. రేవంత్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమయిందని విమర్శించారు. యుద్ధ ప్రాతిపదికన చెరువుల నిర్వహణ కాంట్రాక్ట్‌లను పునరుద్ధరించాలని, గుర్రపుడెక్కను తొలగించాలని, ప్రతి డివిజన్‌లో ఫాగింగ్ మిషన్ల సంఖ్యను పెంచాలని, నిరంతరం యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని, తాగు నీటికో

ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత : ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి

శ్రీ పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి, ఎస్ ఐ భరత్, వైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులు.

మలక్ పేట, ఫిబ్రవరి 27, ప్రభాతవార్త: ఆధ్యాత్మిక భావనలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ మూత్తినేని వీరయ్యలు పేర్కొన్నారు. ప్రతి నెల చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ఓల్డ్ మలక్ పేట శ్రీ పోచమ్మ దేవాలయంలో దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. దేవాలయం చైర్మన్ బాబు శ్రీనివాస్, వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ లు మాట్లాడుతూ ప్రతినెల చివరి శుక్రవారం దేవాలయంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాని నిర్వహిస్తున్నామని తెలిపారు. శ్రీ పోచమ్మ దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ భరత్ కుమార్, సభ్యులు శివకుమార్, శ్రీనివాస్ గుప్తా, తాటి కొండ శ్యామ్, అశోక్, బిఆర్ఎస్ నాయకులు పగిళ్ల నర్సింగ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుడు జంగాల పెంటయ్య యాదవ్ వర్ధంతి

మల్కాజ్‌గిరిఫిబ్రవరి 27, ప్రభాతవార్త: దేశ స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన జంగాల పెంటయ్య యాదవ్ 19వ వర్ధంతి సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మీర్జాలగూడలో శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు జంగాల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ, స్వాతంత్రం కోసం త్యాగం చేసిన మహనీయుల సేవలను తరతరాలకు చాటి చెప్పడం మన బాధ్యత అని అన్నారు. తమ తండ్రి ఆశయాలను నిలబెట్టేందుకు సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. యువత దేశభక్తి, సేవా భావం కలిగి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామారావు యాదవ్, క్రాంతి యాదవ్, మహమ్మద్ రషీద్, జంగాల వెంకటేష్ యాదవ్, జంగాల శివ శంకర్ యాదవ్, శ్రీలత, విజయలక్ష్మి, వసంత, మాధవి, జానకి, మోనిక, ధనరాజ్, మోహిత్, సంతోష్ యాదవ్, కవిత, శోభ, రాధికా, దీప్తి, ఆకాష్, వెంకట్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ఆర్థోపెడిక్ సర్జన్‌గా డాక్టర్ బాలరాజు నాయుడు

సైదాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక త్రి బెస్ట్ రేటెడ్ సంస్థ నిర్వహించిన సమగ్ర సర్వేలో ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ రోబోటిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ఎం.బాలరాజు నాయుడు వరుసగా రెండవసారి హైద్రాబాద్ టాప్ 3 ఆర్థోపెడిక్ సర్జన్స్‌లో స్థానం సంపాదించారు. ప్రతి సంవత్సరం 50 పాయింట్ల పరిశీలన ప్రకారం త్రి బిస్ట్ రేటెడ్ సంస్థ వైద్యులను ఎంపిక చేస్తుందని, వాటిలో శస్త్ర చికిత్స ఫలితాలు, వైద్య సేవల నాణ్యత, విశ్వసనీయత, సోషల్ మీడియా ప్రజెన్స్, ప్రజాదరణ, ఆసుపత్రిలోని మౌళిక సదుపాయాలు, ఆధునిక రోబోటిక్ టెక్నాలజి వినియోగం, రోగుల సంతృప్తి, రోగుల ఎక్స్‌పీరియన్స్ తదితర అంశాలు ఈ జాబితాలో ఉంటాయని డాక్టర్ బాలరాజు నాయుడు తెలిపారు. ఈ గుర్తింపు తన వ్యక్తిగత విజయం కాదని, ఓనస్ రోబోటిక్ హాస్పిటల్స్ టీం మొత్తం కృషికి లభించిన గౌరవమని అన్నారు. బెస్ట్ ఆర్థోపెడిక్ సర్జన్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ బాలరాజు నాయుడుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మాధవనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సైదాబాద్, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్ మాధవనగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఓనస్ రోబోటిక్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బిపి, షుగర్, ఇసిజి తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ చైతన్య రెడ్డి, మాధవ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, కార్యదర్శి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో నడవాలి : సబిత



సబితా ఇంద్రారెడ్డిని సత్కరిస్తున్న దేవాలయం ప్రతినిధులు

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: క్రమశిక్షణతో మెలుగుతూ భక్తి మార్గంలో నడవాలని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ సౌభాగ్యపురంకాలనీలోని శ్రీపద్మావతి సమేత గోదా వెంకటేశ్వరస్వామివారి దేవాలయంలో శ్రీనివాసుని దశవతరాలు, విమాన వెంకటేశ్వరాస్వామి, రాజగోపుర ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబితాఇంద్రారెడ్డిని శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి వారి వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సబ్యులు సబితఇంద్రారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి మెమంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రదానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, అయ్యాచితం శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నాగేష్, నాయకులు రామాచారి, శ్రీనివాస్‌రెడ్డి, గొడుగు శ్రీనివాస్, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, జగన్మోహన్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, శ్యాంగుప్త, వెంకటేష్ గౌడ్, రాంనర్సింహాగౌడ్, కపిల్, ముచింతల జగన్, దేవాలయం కమిటీ సబ్యులు వెంకట్‌రెడ్డి, మూర్తి, నర్సింహారెడ్డి, శ్రీధర్, రామారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కావేరినగర్ కల్వర్టు వద్ద పగిలిన మంచినీటి పైప్ లైన్

-కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం .. ఆగిపోయిన రాకపోకలు

ఉప్పల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : ఉప్పల్ కావేరినగర్ కల్వర్టు వద్ద కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల క్రితం కావేరి నగర్ కల్వర్టు నిర్మాణం కోసం రూ.2 కోట్లతో పనులు చేపట్టారు. అప్పట్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు సుమారు ఏడాది పాటు కొనసాగాయి. దీంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. అధికారులు, పాలకులు సదరు కాంట్రాక్టర్‌పై వత్తిడి తీసుకుని రావడంతో పనులు పూర్తి చేసి వెళ్లిపోయారు. పనులు ముగిసిన మరో ఏడాదిలోనే తిరిగి చిలుకానగర్ నుంచి కావేరినగర్ కల్వర్టు వరకు డ్రైనేజీ పైప్ లైన్ పనులు చేపట్టారు. ఈ పనులు కూడా నెలల తరబడి కొనసాగి ఇటీవలే పూర్తి చేశారు. కొద్ది రోజుల క్రితం ఉప్పల్ భరత్‌నగర్ నుంచి కావేరినగర్ కల్వర్టు వరకు డ్రైనేజీ పైప్ లైన్ పనులు చేపట్టారు. ఈ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం భరత్‌నగర్, హనుమాన్ నగర్ మీదుగా రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఇదిలా ఉండగానే చిలుకానగర్ నుంచి వస్తున్న వరద నీటి కాలువ పైప్ లైన్ పనులను సమీపంలో ఉన్న దారిలో కాకుండా ప్రధాన రహదారి మీదుగా తీసుకుని వస్తున్నారు. పనులు గత నెల రోజులుగా సాగుతున్నాయి. అయితే గురువారం రాత్రి కావేరినగర్ కల్వర్టు వద్ద కాంట్రాక్టర్ జెసిబితో పనులు చేపడుతుండగా మంచినీటి పైప్‌లైన్‌కు తగిలి ధ్వంసం అయ్యింది. దీంతో సుమారు గంట సేపు మంచినీరు రోడ్డుపై పారింది. దీంతో స్థానికులు స్పందించి జలమండలి అధికారుల దృష్టికి తీసుకుని రావడంతో జిఎం సంతోష్ కుమార్ వెంటనే స్పందించి నీటి సరఫరా నిలిపి వేయించారు.

కావేరినగర్ కల్వర్టు వద్ద పైప్‌లైన్ పగిలి రోడ్డుపై వృధాగా పారుతున్న మంచినీరు దృశ్యం..

అధ్వానంగా మారిన కావేరినగర్ కల్వర్టు : ఉప్పల్ డివిజన్ కావేరినగర్ వద్ద నిత్యం అధికారులు ఎదో ఒక సాకుతో తవ్వకాలు చేపడుతున్నారు. చిలుకానగర్, నాచారంకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఈ రహదారి బిజిబిజీగా ఉంటుంది. అయితే తవ్వకాల కారణంగా ఆర్టీసీ బస్సు సర్వీసులను దారి మళ్లించారు. కావేరినగర్, హనుమాన్‌నగర్, భరత్‌నగర్‌లకు బస్సు సర్వీసులు నిలిచిపోయాయి. ఈ దారిలో నిత్యం వివిధ విభాగాల అధికారులు ఎదో ఒక చోట తవ్వకాలు చేస్తుండడంతో స్థానికులకు అవస్థలు తప్పడం లేదు. జిహెచ్ఎంసి రోడ్డు వేసిన వెంటనే జలమండలి కాంట్రాక్టరుల రోడ్డు తవ్వకాలు చేస్తున్నారని ఆరోపణలు చేస్తుండగా, తాము ముందుగా చెప్పినా కూడా పట్టించుకోకుండా రోడ్డు వేస్తున్నారని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగానే ప్రజలు అవస్థలు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

ఉప్పల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : ఉప్పల్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరీక్ష ప్యాడ్స్‌లను పంపిణీ చేశారు. బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, సహాయ పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితోపాటు, పలువురు పార్టీ నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు విజయవంతంగా పరీక్షలు రాయాలని, నిరుపేద విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. పరీక్షలలతో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు తగు చేయూత అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పన కోసం తగు చర్యలు తీసుకుంటున్నామని, విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం ఉంటుందన్నారు. సహాయ పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆకుల మహేందర్ తదితరులు

వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అన్ని విధాలుగా చేయూత అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు ప్యాడ్స్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, పలువురు విద్యార్థులు, బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేశా : మాజీ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప

సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: జిహెచ్ఎంసిలో విలీనం కాక ముందు ఉన్న మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 7వ డివిజన్‌కు సంబంధించిన కాలనీల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేయడం జరిగిందని మాజీ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప స్పష్టం చేశారు. పునర్విభజన జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్తగా ఏర్పడిన డివిజన్ 59 జిల్లెలగూడకు సంబంధించిన ఆర్ఎన్‌రెడ్డినగర్ ద్వారకామాయినగర్, లక్ష్మీనగర్ కాలనీల్లో మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మంజూరైన రూ.20 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు టిపిసి రాజు, రంజిత్‌రెడ్డి, కార్యదర్శి కరుణాకర్ యాదవ్, నరేష్‌రెడ్డి, పలువురు కాలనీవాసులతో కలిసి రోడ్డు నిర్మాణపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్‌గా తాను ప్రాతినిధ్యం వహించిన ప్రాంతాలు జిల్లెలగూడ డివిజన్‌లోకి రావడం హర్షణీయమన్నారు. ప్రస్తుత డివిజన్‌లోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన వెల్లడించారు. స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి చేయిస్తామని ఆయన అన్నారు. అయితే కాలనీల్లో సిసి రోడ్ల నిర్మాణాలు ప్రారంభం కావడం పట్ల కాలనీవాసులు సబితా ఇంద్రారెడ్డికి అదే విధంగా సిద్దాల బీరప్పకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గట్టు నర్సింహ, అశోక్, రామాచారి, భావన శ్రీధర్ పాల్గొన్నారు.

జిల్లెలగూడ డివిజన్‌లో రోడ్ల నిర్మాణపు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంక్షేమ సంఘాల నాయకులు, కాలనీవాసులతో కలిసి పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సిద్దాల బీరప్ప

కాలనీవాసులు, కార్యాలయ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించలేదు: ఎఎంసి శ్రీధర్‌రెడ్డి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి వచ్చిన కాలనీలవాసులతో గానీ కార్యాలయంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో గానీ అనుచితంగా ప్రవర్తించలేదని ఎఎంసి (అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్) జి.శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలపై ఆయన వివరణ ఇస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక బడంగ్‌పేట్ నగర బిజెపి అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి పలువురు కాలనీవాసులతో గురువారం తన ఛాంబర్‌కు వచ్చి డ్రైనేజీతో పాటు వివిధ సమస్యలను చర్చించడం జరిగిందని తెలిపారు. అయితే తాను తాను సంబంధిత సెక్షన్ల డిఇ, ఎఇలతో పాటు డిసిని కలవాలని మాత్రమే చెప్పానని అన్నారు. ఇదిలా ఉంటే ఇంటి పన్నులు చెల్లించని వారికి జోనల్ కమీషనర్ ఆదేశాల మేరకు రెడ్ నోటీసులు జారీ చేసిన విషయం ప్రస్తావనకు వస్తే బిజెపి నేత ప్రజలను భయాందోళనలకు గురి చేస్తారా? పన్నులు చెల్లించవద్దని పత్రికా ప్రకటన ఇస్తానంటూ తీవ్ర స్వరంతో మాట్లాడారని శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. దీనికి తాను స్పందిస్తూ బాధ్యతగల పదవిలో ఉంటూ అలా మాట్లాడవద్దని అన్నానే తప్ప తాను ఎవరితోనూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడలేదని ఆయన స్పష్టం చేశారు. ఇక పోతే సర్కిల్ కార్యాలయంలో ఎఎంసి అడ్మిన్‌గా విధులు నిర్వహిస్తున్న తాను కింది స్థాయి సిబ్బందితో పని చేయించే బాధ్యతతో ఉన్నాననీ ఔట్ సోర్సింగ్ సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించలేదని ఆయన తెలియజేశారు.

ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేయాలని వినతి

జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతి పత్రం అందజేస్తున్న ఉప్పల్ డివిజన్ అఖిలపక్ష కమిటి నేతలు

ఉప్పల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ పారదర్శకంగా చేయాలని ఉప్పల్ డివిజన్ అఖిలపక్ష కమిటి నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ తెలంగాణలో కూడా చేపట్టడం హర్షనీయమన్నారు. ఉప్పల్‌లో ఇంటింటికి తిరిగి జాబితాల సవరణ చేయాలని, ఓట్ల తొలగింపు కూడా పారదర్శకంగా చేయాలని సూచించారు. ఓటర్ల నమోదుతోపాటు, తొలగింపులో కూడా తగు జాగ్రత్తలు పాటించాలని వారు సూచించారు. దీనిపై జోనల్ కమిషనర్ రాధిక గుప్తా సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నెనీ పణీందర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు పి.జితేందర్‌రెడ్డి, మేకల మధుసూధన్‌రెడ్డి, అన్య బాలకృష్ణ, లేతాకుల రఘుపతిరెడ్డి, బిజెపి నేతలు తీగ విఠల్‌రావు, దువ్వాల రమేష్, టిడిపి సీనియర్ నేత పబ్బతి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లెలగూడ లార్డ్స్‌లో విజయవంతమైన కాగ్నిజన్స్ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

లార్డ్స్ కాగ్నిజన్స్-26 కార్యక్రమానికి హాజరైన ఆర్‌సిఐ విశ్రాంత డీన్ డాక్టర్ కృష్ణారావు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడ లార్డ్స్ హై స్కూల్‌లో శుక్రవారం కాగ్నిజాన్స్-2026 పేరిట విద్యావైజ్ఞానిక అవగాహన ప్రదర్శన నిర్వహించారు. లార్డ్స్ గ్రూపు పాఠశాలల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డిల ప్రోత్సాహంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఆర్‌సిఐ విశ్రాంత డీన్ డాక్టర్ కృష్ణారావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్ ఆధ్వర్యంలో అభివృద్ధి చెందిన క్షిపణులపై సందేశాత్మక ప్రసంగం చేశారు. కాగా ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శన సందర్భంగా స్నేక్ షో, సాంప్రదాయ వైద్య చిట్కాలు, లైవ్ హారర్ షోలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విజయవంతంగా ముగిసిన ఈ కార్యక్రమంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో పాటు డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ బబ్బూరి సతీష్, ప్రధానోపాధ్యాయుడు మరియన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాలనీవాసులు

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: చైతన్యపురి డివిజన్ ద్వారకాపురం సీనియర్ సిటిజన్స్ సేవా సమితి సబ్యులు శుక్రవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సీనియర్ సిటిజన్ భవనం రోడ్డు ప్రక్కన ఉండడం వల్ల ప్రతిరోజూ వాహనాల పొగ కాలుష్యం, సౌండ్స్ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సీసీ కెమెరాలు ఎర్పాటు చేయాలని, సీనియర్ సిటిజెన్స్ కు ప్రబుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో సీనియర్ సిటిజన్ కార్యాలయంకు వచ్చి తగు పరిష్కారం చూపిస్తామని, సీనియర్ సిటిజన్ల సంక్షేమం, భద్రత, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ప్రబుత్వం, స్వచ్ఛంద సంస్థలు వివిధ సేవలను, పథకాలను అందిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ భారస పార్టీ యువ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ద్వారాకపురం సీనియర్ సిటిజన్స్ కెపి.ప్రసాద్, రాఘవరెడ్డి, శ్రావణ్, సుబ్బారావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దశావతారాల కార్యక్రమం

కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త: సౌభాగ్యపుర శ్రీనివాస దశావతారాలు, విమాన వెంకటేశ్వర స్వామి, రాజగోపుర ప్రతిష్టా కార్యక్రమం వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ సౌభాగ్యపురంకాలనీలోని శ్రీఅలివేలుమంగ పద్మావతి గోదా సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి దేవాలయంలో సౌభాగ్యపుర శ్రీనివాసుని దశావతారం, విమాన వెంకటేశ్వరస్వామి, రాజగోపుర ప్రతిష్టా కార్యక్రమాన్ని ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం దాన్యాదివాసము కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా భక్తులను ఉద్దేశించి శ్రీత్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ సబ్యులు వెంకట్‌రెడ్డి, మూర్తి, నర్సింహారెడ్డి, శ్రీధర్, శ్రీకాంత్, రామారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే

ఉప్పల్‌లో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ తదితరులు

ఉప్పల్, ఫిబ్రవరి 27 ప్రభాతవార్త : తెలంగాణ ప్రజలకు కళ్యాణలక్ష్మి చెక్‌లతోపాటు, తులం బంగారం కూడా ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ మండల పరిధిలోని సుమారు 151 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన చెక్‌లను తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్‌తో కలిసి అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి చెక్‌ల పంపిణీ పారదర్శకంగా జరగాలని, గత ఎన్నికల ముందు సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా లక్ష నూట పదహారు రూపాయలతోపాటు తులం బంగారం కూడా ఇవ్వాలని సూచించారు. నిరుపేద ప్రజలకు తన వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురికి చెక్‌లు అందజేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ డి,సునీల్ కుమార్, ఉప్పల్ ఆర్ఐలు ఎం.అశ్విని గౌడ్, ఎ.వీరేంద్ర సాయి, సీనియర్ అసిస్టెంట్ శ్రీదేవి, స్వర్ణలత, సర్వేయర్ వెంకన్న, జూనియర్ అసిస్టెంట్‌లు ఎం. అనంత రాములు, సాయినాద్ రెడ్డి, అంజిరెడ్డి, పి.వెంకన్న, ఎం,అలివేలు వనిత, స్వాతి, అటెండర్స్ సత్యనారాయణ, సంజీవ పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

యువతే రోడ్డు భద్రతకు అంబాసిడర్లు

నేరేడ్ మెట్ , ఫిబ్రవరి 27,ప్రభాతవార్త : యువతలో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అదవి రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన నేరేడ్మెట్ ఎస్ఐ సాయి అవినాష్ మాట్లాడుతూ నిరక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఎం. వేణుగోపాల్ రోడ్డు భద్రతా నియమాలు, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. చివరగా విద్యార్థులచే రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ వినోద్ బ